తిరుగు ప్రయాణంలో వారికి ఓ జ్ఞాని దర్శనం అయ్యింది.

"స్వామీ మాలో ఎవరికి ఎక్కువ గంగాస్నాన ఫలం లభించింది?" జట్టు నాయకుడు అడిగాడు.

"మీ గ్రామస్థుడు అయిన కాశీరామ్‌కి. అతను కాశీకి వెళ్ళడానికి కూడబెట్టిన డబ్బుని ఏం చేశాడో అడిగితే మీకే తెలుస్తుంది." చెప్పాడు జ్ఞాని.

గ్రామం చేరాక వారు కాశీరామ్‌ని కలిసి ఆ డబ్బు గురించి అడిగారు.

"నేను కాశీకి బయలుదేరే ముందు రోజు రాత్రి మా పక్కింటి అతను తన గర్భవతి అయిన భార్యకి ఆహారం కోసం పెంపుడు కుక్కని చంపబోవటం గమనించాను. నాలుగు రోజులుగా వారికి ఆహారం లేదని తెలిసి నా డబ్బుతో వాళ్ళకి నెలకి సరిపడా సంబారాలు కొనిచ్చాను." చెప్పాడు కాశీరామ్.

పుణ్య తీర్థాల దర్శనంకన్నా సత్కార్యం చేయడం మంచిదని వారంతా గ్రహించారు.

## 200. కర్తవ్యం

ఓ గృహస్థు సన్న్యాసం తీసుకోవడానికి నిశ్చయించాడు. మర్నాడు ఆశ్రమ స్వీకారం. స్వగృహంలో మరమ్మత్తులు చేయించసాగాడు. అది గమనించిన పక్కింటతను అడిగాడు.

"రేపు వెళ్ళి పోతున్నారు కదా? ఎందుకీ హడావిడి?"

"నేడు నేను గృహస్థుడ్ని కాబట్టి నేడు ఆ ధర్మాన్ని నిర్వర్తిస్తున్నాను. రేపటి ధర్మం ఇవాళ కూడదు. ఇవాళ ధర్మం రేపు కూడదు. రేపటి కర్తవ్యం వేరే వుంటుంది." చెప్పాడాయన.